క్లుప్తంగా

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

భీమవరం: అనాథాశ్రమంలో చదువుతున్న విద్యార్థులు అంతర్జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభచూపి పతకాలు అందుకోవడం గర్వకారణమని వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ యు శ్రీనిసుందరావు అన్నారు. మలేషియాలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించిన భీమవరం మండలం చినఆమిరంలోని ఇమ్మానియేల్ అనాథాశ్రమ విద్యార్థులు నేతల అశ్విని, దండే ప్రియ, బత్తుల జెస్సీని ఇంటర్నేషనల్ డిస్టిక్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించి, ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం ఆశ్రమానికి నిత్యావసర సరుకులు, విద్యార్థులకు రగ్గులు, స్టీల్ కంచాలు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు ఎర్నెస్ట్ పాల్, కరాటే శిక్షకుడు జోసుల విజయ భాస్కర్ పాల్గొన్నారు.

దివ్యాంగులు క్రీడల్లో సత్తా చాటడం అభినందనీయం



విభిన్న ప్రతిభావంతుల క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: విభిన్న ప్రతిభావంతులు విద్యతో పాటు క్రీడల్లోనూ సత్తాచాటడం అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో 65వ ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడాపోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల్లో జిల్లా నలుమూలల నుంచి 500 మంది వరకు విభిన్న ప్రతిభావంతులు హాజరుకావడం విశేషమన్నారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు రామ్‌కుమార్, డాక్టర్ యువీ రమణరాజు, విభిన్న ప్రతిభావంతుల వివిధ సంఘాల నాయకులు బీవీ రమణ, జి సంపతరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఉండి: నిరాశ్రయులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదుసూరి శివరామరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని మహదేవపట్నం శివారు రామచంద్రాపురంలోని సన్‌రైజ్ వృద్ధాశ్రమంలో దాత గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు ఆర్థిక సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజు, కాగిత మహంకాళి, పెన్మత్స గన్నాథరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

వీరవాసరం: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఎంపీపీ వీరవల్లి దుర్గభవాని కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. వీరవాసరం మండలానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే వివిధ గ్రామాల్లోని సీసీ రహదారులు, డ్రెయినేజీలు, మంచినీటి సరఫరా వంటి అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానం చేశారు. ఎంపీడీవో కే రవికుమార్, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, బోను జోష్ణ దేవి, వీరవల్లి కృష్ణకుమారి, గూడూరి ధనలక్ష్మి, నాగరాజు పద్మకల, పంజా మంగతాయారు, గుళ్లపల్లి విజయలక్ష్మి, యాలబండి ఇందిరా, కడలి నెహ్రూ, ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలి

భీమవరం అర్బన్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని తోకతిప్పలో శుక్రవారం సీపీఎం నాయకులు స్మార్ట్ మీటర్ల నిర్ణయంపై నిరసన వ్యక్తం చేస్తూ విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రంబాబు విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు, అదనపు ఛార్జీలు పెంచి ప్రజలపై వేల కోట్ల భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. తిరుమాని నాగేశ్వరరావు, బొడ్డు లక్ష్మీపతి, పొన్నమండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రామ ధనుస్సుకు పూజలు

వీరవాసరం: అయోధ్య–భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్ ద్వారా ఏడాదిన్నరగా అయోధ్యలో ప్రతి రోజు అన్నదానం చేస్తూ బాలరాముడి సేవలో తరిస్తున్న జిల్లా వాసి దేశవ్యాప్తంగా ప్రధాన ఆలయాల పర్యటిస్తున్నారు. నిజామాబాదు జిల్లాకు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి కిలో బంగారం, 13 కిలోల వెండితో చెన్నైలో తయారు చేయించిన రామ బాణం, ధనుస్సును దేశంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో, మఠాల్లో, పీఠాల్లో ఉంచి పూజలు చేయిస్తున్నారు. ఈ ధనస్సు, బాణాన్ని 2025 ఏప్రిల్ 6న అయోధ్య బాలరాముడి ఆలయానికి ఆయన అప్పగించనున్నారు. రాముడి 14 ఏళ్ల వనవాసానికి గుర్తుగా 14 కిలోల ధనుస్సు, బాణం తయారు చేయించినట్లు తెలిపారు. శుక్రవారం నందమూరు గరువు ఉత్సావాల్లో ఈ బాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతుల సంక్షేమాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు
- అన్నదాతలను అన్ని విధాలా ఆదుకోవాలి
- వైఎస్సార్‌సీపీ నాయకుల డిమాండ్



పాలకోడేరు: కలెక్టర్‌కు సమస్యలపై వినతిపత్రం అందించేందుకు వెళ్లిన పాలకోడేరు రైతులు, నాయకులు



పెద అమిరం పార్టీ కార్యాలయంలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

కాళ్ల : వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని పార్టీ ఉండి నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. కాళ్ల మండలం పెద అమీరం పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రైతులకు అండగా నిలిచేందుకు కలెక్టర్లకు వినతిపత్రం ఇచ్చేందుకు ర్యాలీగా బయలుదేరారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20వేలు ఇవ్వాలి డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాల్సిందేనని, దళారీ వ్యవస్థను తొలగించాలని డిమాండ్ చేశారు తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని హితవు పలికారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని కోరారు. రైతుపై అదనపు భారం మోపే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలబడుతుందన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతులకు ఎంతో మేలు చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ నాయకులు శ్రేణులంతా పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు, ఉండి మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పోరుబాటకు తరలివెళ్లిన రైతులు

పాలకోడేరు: వైయస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల మద్దతు ధరల కోసం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాకు ఇచ్చిన పిలుపుమేరకు పాలకోడేరు మండలంలోని రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారంతా మండల కేంద్రమైన పాలకోడేరు సెంటర్‌కు చేరుకొని ర్యాలీగా బయలుదేరి జిల్లా కేంద్రమైన భీమవరం చేరుకుని కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండు నాగేశ్వరరావు, చేకూరి నరేంద్ర రాజు, పెనుమత్స ప్రసాదరాజు, గెడ్డం జోషి, వడ్డిగూడెం వరదరాజు పాల్గొన్నారు.



భీమవరంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ర్యాలీ



భీమవరంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

జగనన్న జెండా కార్యక్రమానికి విశేష స్పందన

భీమవరం: రైతన్నలను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలకు నిరసనగా శుక్రవారం భీమవరంలో రైతన్నకు అండ–జగనన్న జెండా పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి భీమవరం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పట్టణంలోని విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరం కలెక్టరేట్ వరకు పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా రైతులకు మద్దతు ధర కల్పించాలి, ఇన్‌పుట్ సబ్సిడీ తక్షణం ఇవ్వాలి, పంట బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. తేమశాతం పేరుతో రైతులను దోచుకుంటున్న మిల్లరు, దళారులపై చర్యలు తీసుకోవాలని, రైతులకు నష్టం చేస్తున్న ప్రభుత్వ విధానాలను తక్షణం వెనక్కి తీసుకోవాలి, సూపర్ సిక్స్ హామీలు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు ప్రారంభం కాకపోవడంతో రైతుల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం కావడంతో భీమవరం, వీరవాసరం, భీమవరం మండలాలకు చెందిన రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సఖ్యలో హాజరయ్యారు. వీరిలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పార్టీ మైనార్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, గౌడ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు, గాదిరాజు రామరాజు, మద్దాల అప్పారావు, కోడే యుగంధర్, గంటా సుందరకుమార్, కొమ్మన శ్రీనివాస్, గుంటి ప్రభు, చిగురుపాటి సందీప్, బలే ఏసుబాబు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై అధికారులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ, మండలస్థాయి అధికారులు

ఉండి: స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మండలంలోని 12 సచివాలయల పరిధిలోని 8 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యకర్శులకు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ముగించారు. ఈ సందర్భంగా అధికారులకు గ్రామాల్లో సాధించాల్సిన అభివృద్ధిపై ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలపై శిక్షణనిస్తున్నట్లు కార్యక్రమ కోర్సు డైరెక్టర్ ఎంపీడీవో ఎస్ రవీంద్ర తెలిపారు. ఈ నెల 6న ఏలూరులో డీపీఆర్సీ శిక్షణ కేంద్రంలో సాధించాల్సిన తొమ్మిది లక్ష్యాలను ఈవోపీఆర్డీ, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పంచాయితీరాజ్ ఏఈ, ఏపీఎం, మెడికల్ ఆఫీసర్లకు శిక్షణనిస్తామన్నారు. అధికారుల బృందం మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులకు, గ్రామ సచివాలయ అధికారులకు సాధించాల్సిన తొమ్మిది అంశాలపై శిక్షణనిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సీహెచ్ ఎస్‌వీ రెడ్డి, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలి



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

వీరవాసరం: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తెలిపారు. నందమూరు గరువులో వేంచేసి ఉన్న శ్రీరామ భక్తాంజనేయ స్వామిని శుక్రవారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆనందమయ జీవితాన్ని గడపడానికి స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. ముందుగా భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులచే శ్రీరామ భక్తాంజనేయ స్వామి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేకల వెంకటచలపతి, కొప్పినీడి శ్రీనివాసరావు, కావలి రుషికేశ దామోదర్‌రావు, అప్పారావు, వడ్డీ కనదుర్గ ప్రసాద్, కొప్పినీడి శ్యామలరావు, ముద్రగళ్ల యేసు రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమద్ వ్రత సప్తరాత్ర మహోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మారుతీ టాకీస్ సెంటర్‌లోని దాసాంజనేయ స్వామి 44వ శ్రీహనుమద్ వ్రత సప్తరాత్ర మహోత్సవాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారి గ్రామోత్సవాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పూజ కార్యక్రమాలతో ప్రారంభించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ పూజలు, వ్రతాలు హిందూ సంప్రదాయంలో ఒక భాగమని, మృగశిరా నక్షత్రం హనుమంతునికి ఇష్టమైనదని, మార్గశిర మాసంలో హనుమంతుని ఆరాధనకు విశిష్టమైనదని, హనుమంతుని యథాశక్తి పూజిస్తే భక్త సులభుడైన హనుమంతుని అనుగ్రహం సులభంగా పొందవచ్చునని అన్నారు. ఆధ్యాత్మిక భావన దైవారాధన ప్రతి ఒక్కరూ ఆచరించాలని, 44వ శ్రీహనుమద్వ్రత సప్తరాత్ర మహోత్సవాలను సంప్రదాయబద్ధంగా 7 రోజులపాటు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆలయ ఈవో జి.నాగ సీతారామరాజు, ఆలయ అర్చకులు ఘంటసాల పవన్‌కుమార్ మాట్లాడుతూ 7 రోజులపాటు స్వామివారికి 1,116 కొబ్బరికాయలతో ఏకాదశ రుద్రాభిషేకాలు, 1,500 అరటిపండ్లు, లక్ష తమలపాకులు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేస్తామని, 21న అన్న సమారాధన నిర్వహిస్తున్నామన్నారు.

ప్రత్యేక కౌంటర్లలో నిత్యావసర సరుకులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో బియ్యం, కందిపప్పు, వంటనూనె ప్రత్యేక కౌంటర్లను మరి కొంతకాలం కొనసాగించాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ జేసీ ఛాంబర్‌లో జిల్లాలోని వర్తక సంఘాలు, కిరాణా వ్యాపారస్తులతో బియ్యం, కంది పప్పు, వంటనూనె, మినపప్పు, ఉల్లిపాయలు, బహిరంగ మార్కెట్లో నిత్యవసర సరుకులు ధరలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ టమాట, ఉల్లిపాయలు ధరలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. నూనె ధర కొంతవరకు తగ్గిందని నిర్ధారించారు. తణుకులో ప్రత్యేక కౌంటర్లలో మినపప్పు హోల్‌సేల్ ధరలకు విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఎస్‌ఓ ఎం సరోజ, ఏఎస్‌ఓ ఎం రవిశంకర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కే సునీల్‌కుమార్, సీపీఓ కంటిపూడి శ్రీనివాసరావు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి పి. కల్యాణ్, కిరాణా వర్తక సంఘాల యజమానులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దాతలు సహకరించాలి



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

కాళ్ల: అభివృద్ధికి దాతలు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే, ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు కోరారు. మండలంలోని కోపల్లె, గాంధీనగరం, ఆనందపురం, మాలవానితిప్ప, కలవపూడిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోపల్లెలో రూ.12 లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్లకు భూమి పూజ, గాంధీనగర్‌లో జలజీవన మిషన్ నిధులు రూ.5.70 లక్షలు, పలువురు దాతలు రూ.11 లక్షల విరాళాలతో నిర్మించిన మంచినీటి ట్యాంక్ ప్రారంభించారు. మాలవానితిప్పలో జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన వంతెన ప్రారంభోత్సవం, ఎస్సీ బోస్ కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన బస్సు షెల్టర్ ప్రారంభోత్సవం, కలవపూడిలో దాతల సహకారంతో రూ.46 లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పలువురు సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు వెన్ను విరిస్తే సహించేది లేదు



భీమవరంలో నిర్వహించిన రైతు ధర్నాలో పాల్గొన్న ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పీవీఎల్ నర్శింహరాజు, పార్టీ నాయకులు

ఆకివీడు: రైతు వెన్ను విరిస్తే సహించేది లేదని, రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ వెన్నంటి ఉంటుందని ఉండి నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. రైతు సమస్యల పరిష్కారానికి మద్దతుగా మేమున్నామని ఉండి నియోజకవర్గ నాయకులు భీమవరంలో శుక్రవారం నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీఎల్ నర్శింహరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులపై కక్ష కట్టిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో ఖరీఫ్ రైతులు సతమతమవుతోంటే కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. ఖరీఫ్ పంట సాగుకు రైతు భరోసా సొమ్ము చెల్లించలేదని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో రైతుల్ని మభ్యపెట్టేందుకు రూ.20 వేలు రైతు భరోసా ఇస్తానని చెప్పి మోసగించారన్నారు. పంటల బీమా కోసం రైతులే ప్రీమియం చెల్లించాల్సి వస్తోందన్నారు. వైఎస్ జగన్మోహన్ ప్రభుత్వ హయాంలో రైతులకు సాగుకు ముందే భరోసా సొమ్ము చెల్లించేవారని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు వేగంగా పరిహారాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అంబటి రమేష్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. ఆరునెలల్లోనే కూటమి ప్రభుత్వం రైతుల్ని నిండా ముంచిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో మంతెన సునీల్‌కుమార్, మండల వైఎస్సార్ సీపీ మాజీ అధ్యక్షుడు కేశిరెడ్డి మురళి, గుండా సుందర రామనాయుడు, ఆకివీడు నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ గేదల అప్పారావు, ఎండీ జక్కీ, కట్రెడ్డి మోహన్, గాలి సామ్రాజ్యం, ఇంటి ప్రేమానందం, ఎండీ. ఆలీ, కురెళ్ల మాణిక్యాలరావు, కేశిరెడ్డి దిలీప్, దుర్గారావు, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

మిషన్ శక్తి పథకంపై అవగాహన

వీరవాసరం: మిషన్ శక్తి పథకం సఖి వన్ స్టాప్ సెంటర్‌పై వీరవాసరం యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని, శిక్షణ తరగతులు నిర్వహించారు. మహిళలు, బాలికలు లైంగిక వేధింపులకు గురైన సందర్భంలో తక్షణం అందించాల్సిన సహాయం, సేవా తదితర అంశాలపై గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, డ్వాక్రా సంఘాలు, ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణను ఇచ్చారు. ఎంపీడీవో కే రవికుమార్, ఏపీఎం కే జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత రాణి, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతాపారాయణం

ఉండి: ఉండి రాజులపేటలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో 64వ గీతా జయంతిని పురస్కరించుకుని ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన ఉత్సవాలు వైభవంగా కొనసాగాయని ఆలయ ప్రధాన అర్చకుడు సన్నిధిరాజు శేషు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, లలితా సహస్ర పారాయణం, విష్ణు సహస్ర పారాయణం, భగవద్గీత శ్లోకాల ఆలాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నట్లు అర్చకులు తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఉత్సవాలు





నందమూరు గరువులో శ్రీరామ భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉత్సవ దృశ్యాలు

వీరవాసరం: నందమూరు గరువులో వేంచేసి ఉన్న శ్రీరామ భక్తాంజనేయ స్వామి వారి వార్షిక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మేళ తాళాలతో బాణాసంచా కాల్పుల మధ్య వివిధ శక్తి వేషాలు, బజరంగీ డప్పు ప్రదర్శనలు, రేలారేడాన్సులు, బ్యాండ్ మేళాలు, కాళి కామాత వేషాలు, కాంతారా ప్రదర్శనలు చూపరులను కట్టిపడేసాయి. స్వామివార్ల గ్రామోత్సవం చూడడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివార్ల గ్రామోత్సవాన్ని తిలకించారు.

భూసర్వేపై అగ్రహారంలో గ్రామ సభ

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో శుక్రవారం భూముల రీసర్వేపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకురావంతో పాటుగా వినతి పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రమణ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రత్నం, ఆర్ఐ కార్తీక్, సర్పంచ్ సూరవరపు కనకదుర్గ, ఎంపీటీసీ మున్నలూరి సువర్ణలక్ష్మి పాల్గొన్నారు.

మెంటేపూడిలో రెవెన్యూ సదస్సు

వీరవాసరం: రైతు సమస్యల పట్ల రెవెన్యూ సిబ్బంది తక్షణం స్పందించాలని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు తెలిపారు. వీరవాసరం మండలం మెంటేపూడిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 12 అర్జీలు అందాయని వివరించారు. సమావేశంలో డీటీ సుబ్బారావు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

979 మంది ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థులకు ఉద్యోగాలు



క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 18 ప్రముఖ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 979 మంది ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు పొందారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణనిశాంత్‌వర్మ చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం కళాశాలలో ప్రత్యేకంగా అభినందించిన సందర్భంగా మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో టీసీఎస్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, టెక్ మహేంద్ర, బోషణ్ మోటార్స్, అక్రివ హెచ్‌సీఎం, అమెజాన్, జోష్ టెక్నాలజీ తదితర సంస్థలు పాల్గొన్నాయని తెలిపారు. కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డీన్ కేఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.